# మధ్యవర్తి

శ్రీపంతుల శ్రీరామశాస్త్రి

★

అసలు నాకిటువంటి మధ్యవర్తిత్వపు వ్యవహారం నెత్తిని వేసుకోడం అంటే సుతరామూ ఇష్టం లేదు. వీటివల్ల నికరమయిన ఫలితం అంటూ ఏమీ ఉండదు. ఒకవేళ ఏ కొంచెమో మంచి జరిగినప్పటికీ మధ్యవర్తి పొందగల మెప్పేమీ ఉండదు. ఉభయ పక్షాలకూ కలిగిన కష్టనష్టాలకు బాధ్యత, 'మంత్రసాని గండం' అన్నట్టుగా మధ్యవర్తినెత్తిని పడుతుంది. అలాగని మధ్యవర్తిత్వం అంటేనే బెదిరే మనిషిని కాను నేను. అట్లో ఇట్లో తేక రెండువంకలనూ మనం కుదిర్చిన బేరానికి ఒప్పుకొని మన కష్టానికి యత్కించిత్ ప్రతిఫలం లభ్యమయే సావకాశాలున్న మధ్యవర్తిత్వం అంటే నాకేమీ అభ్యంతరం లేదు. కాని, ప్రస్తుతం నేను నడపబోయిన మధ్యవర్తిత్వంలో ప్రతిఫలం లేకపోవడమే కాదు. రయిలు ఖర్చులు సహితం కలిసివచ్చే సావకాశం లేదు.

ఇంత తెలిసీ అంగీకరింపవలసివచ్చింది. కారణం అది ఇంట్లో వాళ్ళ స్వకీయమయిన పని కావడమే. మా మూడవ మరదలు పెళ్ళి సంబంధం నిశ్చయించేటప్పుడు నేను "అంతదూరపు సంబంధం, ముక్కూ మొగం ఎరగని సంబంధం ఎందుకు చేస్తా''రంటే నన్నందరూ దుయ్యబట్టేరు. నాకంటె ప్రయోజకుడయినవాడు తోడల్లుడు కావడానికి సహించలేక అలా అన్నానేమోననే ధ్వనికూడా వినిపించింది మావాళ్ళమాటల్లో. సరే, కానీ, నాకేం పోయిందని, "ఓ, మీకందరికీ యిష్టపడితే నాకేం, నాకూ భేషుగ్గా నచ్చింద"న్నాను. అయితే శెలవులేకపోవడంవల్ల పెళ్ళికిమాత్రం వెళ్ళలేదు. నేననుకొన్నట్టేఅయింది. పెళ్ళిలోనే నానారసాభాస జరిగినా "పెళ్ళి అనేది జరిగినప్పుడు, పదిమంది ఒకదగ్గర చేరేక ఆమాత్రం మాటపట్టింపులు రాకపోతాయా, అంతమాత్రంలో ములిగిపోయిందేమిటి — పెళ్ళికొడుకూ, పెళ్ళికూతురూ ఈడూ జోడూ రూపూ రేఖా ఇంతలా కుదరడమంటే నిజంగా దైవఘటనే" అనుకొన్నారు రెండువంకలా కావలసినవాళ్లు. కాని, చివరకు జరిగినదేమంటే, మధ్యను పెళ్ళిలో వచ్చిన తక్కన బంధువుల తగాదాలు అంతరించిపోయేయిగాని, ఇంకా పెళ్ళికొడుకూ పెళ్ళికూతురూ ఏమిటి, భార్యాభర్తలనడుమ సామరస్యం గగనారవిందమయిపోయింది. మా శకుంతల అక్కడికి వెళ్ళి ఆ సమిష్టి కుటుంబంలో కాపురం చెయ్యలేదన్న సంగతి మొదటిసంవత్సరంలోనే రూఢిపడిపోయింది. అతను ఎమ్. ఏ. చదివాడు, కాని, థరుడుక్లాసులో పాసవడంవల్ల కావాలనుకొన్న లెక్చరరుపని లభించలేదు; దొరకడానికి సావకాశం ఉన్న స్కూలుమాస్టరీ గుమస్తాగిరీవంటివి చెయ్యడం పరువుతక్కువ. ఇంతకి ఏమీ చెయ్యనక్కరలేకుండా గడిచిపోయే పాటి భూవసతి ఉంది. పల్లెటూళ్ళో బద్ధకంగా కూర్చోడం, పేకాడ్డం, స్థానిక రాజకీయాల్లో ప్రముఖుడుగా పాల్గొనడం అలవాటయిపోయినందున అతనికి ఎక్కడికి కదలడానికీ మనస్కరించలేదు. ఆ ఊళ్ళో ఉన్నంతకాలం నేను వెళ్ళనంటోంది మా శకుంతల. అంతేకాదు, అతని ప్రవర్తననుగురించి ఏవేవో అనుమానాలు.

మొదట్లో అనుమానాలకి ఆధారం ఉన్నా లేకపోయినా భార్య పుట్టింటికి వెళ్ళిపోయి, మొండికెత్తి రానని కూర్చున్నతరవాత అతనికి చాలా స్వేచ్ఛగా ఉన్నట్టనిపించింది. అదిచూసి వాళ్ళవాళ్ళు తమకు నచ్చిన ఇంకొక సంబంధం కుదిర్చి పెళ్ళి చేసీసేరు. ఒక ఏడాదిలో ఆ సంబంధానికి ఒకకొడుకుకూడా కలిగేడు. మావాళ్ళు, "ఆఁ, ఏదో బెదిరించడానికి అంటారుగాని అంతధైర్యంగా మళ్ళీ పెళ్ళిచేస్తారా" అనుకొన్నారు. తరువాత బహుభార్యాత్వాన్ని నిరోధించ బిల్లు రాకపోతుందా అనుకొన్నారు. కాని, బిల్లు రాకముందే అక్కడ పిల్లవాడుకూడా కలిగేడు.

మామామగారు తాను గవర్నమెంటుఉద్యోగం చేస్తున్నాళ్ళు, రిటైరయిన తరువాత పెన్షను పుచ్చుకుంటూ హాయిగా నిర్విచారంగా గడపవలసిన కాలంగురించే కలలు కన్నారు. కాని పాపం రిటైరవడాని కింకా ఒక ఏడాదిముందే హృద్రోగంవలన (అంటే డాక్టరుకు ఫలానా అని జబ్బు తేలకుండా) పోయారు. ఉద్యోగంలోఉన్న మా పెద్దబావమరిదికి ఏడుగురు పిల్లలు. తన సంపాదన తనకే చాలడం లేదు. ఇక, చిన్నవాళ్ళచదువులు పూర్తి కాలేదు. ఒక్కమారుగా ఇబ్బందులు తెలిసి వచ్చాయి. కాని, అదివరకు అలవాటయిన ఖర్చు వెచ్చాలు ఎంత ప్రయత్నించినా తగ్గడం లేదు. పూర్వం "చెట్టుకాయ చెట్టుకి బరువా, మాపిల్ల మాకేమీ ఎక్కువ కాదని" అన్నంత ధీమాగా మా అత్తగారు అనలేకపోతున్నది.

ఆయీపరిస్థితులనుపురస్కరించుకొని మా ఆవిడ నాకు అంటగట్టినమధ్యవర్తిత్వం ఇది. ఇప్పటికయినా అతను వాళ్ళ ఊరు విడిచి ఉంటే వచ్చిఉండడానికి అభ్యంతరం లేదు. లేనిపక్షంలో ఖర్చులనిమిత్తం నెలకొక యాభైరూపాయిలయినా పంపించాలి. ఇవీ మా ఆవిడ చెప్పిన షరతులు. అసలు మా అత్తగారి లెక్కప్రకారం నెలకు యాభైఏమిటి, వందయినా ఠేందీ ఎలా సరిపోతుందని. నేను ఏమీ లేనికంటె నయంకదా అని, స్వతంత్రించి ముప్ఫైవరకూ దిగేను. కాని అవతలివాళ్ళది ఒకటేమాట. "మేమేమయినా పొమ్మన్నాము గనక నా డబ్బిచ్చుకొందికి. కావాలంటే వచ్చి ఉండమనండి. అంతే కాని ఎత్తి డబ్బు ఒక దమ్మిడీ అయినా ఇచ్చేది లేదు. ఇక కోర్టులంట తిరగడమే అంటూ వస్తే, ఏదో అంతు చూసేస్తాము. మా సంగతి ఈ ప్రాంతంలో ఎవళ్ళ నడిగినా తెలుస్తుంది."

నేను చక్కగా పుల్లయ్య వేమవరంనుండి తిరిగి వచ్చినట్లుగా తిరుగుముఖం పట్టేను. అయితే నాకూ పుల్లయ్యకూ ఒక్కటే భేదం. ఎందుకు వెళ్ళడమో తెలియకుండా వెళ్ళివచ్చాడు పుల్లయ్య; వెళ్ళినపని ఎలాగూ కాదని తెలిసి, వెళ్ళి వస్తున్నాను నేను.

గుంటూరు నుండి తిరుగుదలలో బెజవాడలో పూర్వ మిత్రులకోసం గాలించేను. ఒకడు ఇల్లుమార్చేడు. కొత్త ఇల్లు కనుక్కోడం నాశక్యమయింది కాదు. మరొకడికి ఆఊరునుండి బదిలీఅయిపోయింది. వేరొకడి ఇంటిదగ్గర "ఊళ్ళోలేరు, నాలుగురోజులవరకూ రారనిచెప్పవే అమ్మాయి" అన్నకేక వినిపించి ఆ అమ్మాయి తలుపు తెరిచేలోపున నేను సందుమలుపు తిరిగిపోయేను.

కేవలం మిత్రులను చూడ్డంకోసం ఒకమారు బెజవాడ వెళ్ళాలనుకొని, వాళ్ళవల్ల రమ్మని పలుమార్లు ఆహ్వానాలు పొందిన నేను ఆ రాత్రికి ఏదో హోటలులో భోంచేసి పడుక్కోవలసిగావడంతో చాలా క్రుంగిపోయేను. ఇంతకీ ఇందులో పొరపాటేమయినా ఉంటే అది నాదేగాని ఇతరులది కాదు. నేను అక్కడ గుంటూరులో పనిఅయిపోయేక తిన్నగా ఇంటికివెళ్ళిపోవాలనుకొన్నవాణ్ణి ఇక్కడ దిగడమూ అదీ ఆఫీసులేని ఆదివారంనాడు. ఏమయితే నేం ఒక్కొక్కనాడు బయలుదేరిన వేళావిశేషంఅది.

రిక్షాలో స్టేషనుకివస్తున్నానే గాని మెయిలందుతుందనే నమ్మకం నా కెంతమాత్రం లేదు. ఏమంటే నా ప్రయాణం మొదటినుండి అంతా అసందర్భంగానే జరుగుతూ వచ్చింది.

మెయిలందడమే కాదు, స్థలంకూడా సమృద్ధిగానే దొరికింది. అంటే మీదను రెండుపెట్టెలు కొంచెం అటూఇటూ సర్ది హోల్డాలు పరుచుకొందికీ, క్రిందను విశాలంగా చేరబడి కూర్చుందికీ జాగా దొరికింది. కాని అక్కడ పని సాధించలేకపోవడమూ, బెజవాడలో మిత్రులనుకూడా కలుసుకోలేకపోవడమూ కేవలం తన అసమర్థతవల్లనే యుద్ధంలో పరాజయంపొందిన సేనానాయకుడిలాగ రూపించసాగింది. నే నేదో చాలా తెలివితక్కువపని చేసివస్తున్నట్టనిపించింది. కొన్ని దినపత్రికా వారపత్రికలు కూడా చదవాలనిపించలేదు. అయినా అంతకంటె చేసేపని ఏమీలేదు గనుక ఊరికే తిరగవేస్తున్నాను.

నాకు రయిలు కదులుతూ ఉండగా ఎక్కేవాళ్ళంటే మా చెడ్డకోపం, వీళ్ళకు తమ ప్రాణం అంటే ఇంతమాత్రమయినా తీపిలేదేమో అని. మా స్నేహితుని తమ్ముడొకడు, చాలా వృద్ధిలోకి రావలసిన కుర్రవాడొకడు నేను చూస్తూఉండగానే నడుస్తున్న రయిల్లోకి ఎక్కబోయి కాలుజారిపడి, ఒక చెయ్యి కాలూ పోగొట్టుకొన్నాడు. అప్పటినుండి నాకు మరీ భయం, సకాలంలో రైలెక్క లేకపోతే ప్రయాణమయినా ఆపుకొంటాను గాని, నడుస్తున్న రైల్లోమాత్రం ఎక్కను.

ఆనాడు మాత్రం రయిలు నడుస్తూఉండగా తానెక్కి కూలివాడి నెత్తినున్న హోల్డాలు అందుకొన్న మనిషిని నేనే ప్రత్యుత్థానంచేసి పిలిచాను

నా ప్రక్కను కూర్చున్న తోడి ప్రయాణికులకు కష్టం తోచినాను.

అతను మరెవడో కాదు మా ఆప్తమిత్రుడు దీక్షితులే. క్లాసులో సహాధ్యాయి మాత్రమే కాదు, హాస్టలులో ఒకేగదిలో ఉండేవాళ్ళం. ఈ సుమారు రెండు దశాబ్దుల కాలంలోనూ మనిషి రవ్వంతయినా మారలేదు. వేషమూ అదే, చొక్కా, పంచ, ఒక్కటి అప్పుడు లేనిది కళ్ళజోడొకటుంది. చత్వారంకోసం పెట్టుకొన్నదే కావచ్చును, కాని, కేవలం ఫాషనుకోసం పెట్టుకొన్నాడనుకొందికి వీలుగా అమిరింది. ఇంతెందుకు, అదివరకు తెలిసి ఉండకపోతే పాతికేళ్ళకంటె ఎక్కువ ఉన్నాయంటే నమ్మలేకపోదును. నాలాగ అనారోగ్యం మూలంగా నలభైఏళ్ళకే బాగా ముసలికళ వచ్చిన వాళ్ళమాటకేమి, మా మిత్రులలో కొందరు బలంగా ఆరోగ్యంగా ఉన్నవాళ్ళు లేకపోలేరు. కాని, ఇంతలాగ వయస్సుతో సంబంధంలేకుండా శరీరాన్ని మార్పు చెందనివ్వకుండా నిలబెట్టగలిగిన వాళ్ళు మరెవళ్ళూ లేరు. పళ్ళుకూడా అప్పటిలాగే తెల్లగా స్వచ్ఛంగా ఉన్నాయి. నాయీ ఆలోచనంతా కొద్ది క్షణాలు మాత్రమే. అతను చటుక్కున నన్ను పోల్చుకోలేకపోయేడు: అంతలా మారిపోయే నన్న మాట.

సుమారు పదేళ్ళక్రితం ఒకమారిలాగే రైల్లో కలిసేము గాని నేను ఆ పక్క స్టేషనులోనే దిగవలసి రావడంవల్ల అయిదునిమిషాల కంటె ఎక్కువ మాట్లాడుకొందికి వీలుచిక్కలేదు. అందుచేత మొట్ట మొదట ప్రయాణం ఎంతవరకో కనుక్కొన్నాను. ఇంటికే అన్నాడు. అంటే శ్రీకాకుళం అన్నమాట. మరి బాధలేదు. సాయంకాలం విజయనగరం వచ్చే వరకూ కలిసిఉండవచ్చును.

మాట్లాడుకోవలసినవి ఎంతో ముఖ్యమయిన విషయాలున్నప్పుడు మొట్టమొదట ఏవేవో మామూలు సంగతులే—ఈ సంచి ఎంతకు కొన్నావనీ, వాచీ అప్పటిదేనా అనీ, రెయిలివాళ మామూలుగా వచ్చేలేటేనా లేక కాలమానం ప్రకారం నడుస్తూందా అనీ—ఇటువంటివే వస్తాయి.

రయిలు బాగా వేగం అందుకోడంతో మా సంభాషణ దారిలోపడింది. నేను ముందు అతని ప్రయాణపు సంగతి కనుక్కొన్నాను. మొదటి సంగతి వేసవికాలం కోర్టులకి శెలవులుకదా అని బయలుదేరేనన్నాడు. ఇక ఏడెనిమిదేళ్ళుగా ఇల్లూ వాకిలీ, తిండీ తిప్పలూ తిన్నగా లేక నానా అవస్థపడి ఇటీవలే సినీమారంగంలో కాస్త ముందుకి వచ్చిన నరసింహమూర్తి మరీ మరీ రమ్మన్నాడన్నాడు. ఇంతకీ, ఎక్కడయినా హోటలు భోజనమే కదా అని బయలుదేరేనన్నాడు. మొత్తానికి ఒక నెల్లాళ్ళు మద్రాసు బెంగుళూరు మొదలయిన ప్రదేశాలు పర్యటించి తిరిగివస్తున్నానన్నాడు. నేను అనకపోలేదు, నీకు అంతదూరం వెళ్ళడానికి వీలయిందిగాని మా ఊరొకమారు రావడానికి వీలయింది కాదుకదూ ఇన్ని సంవత్సరాలలోనూ అన్నాను.

వాడూ ఊరుకోలేదు. "ఎప్పుడంటే అప్పుడు వెళ్ళగలం అన్నంతదగ్గరగా ఉన్న ఊళ్ళువెళ్ళడమే కష్టం అనుకో. వెళ్ళడానికేమి పెద్ద అడ్డులేదుకదా అనుకొంటూనే ఎప్పుడూ వెళ్ళలేము, ఇంతకీ నువ్వు నాలో చూపిన లోటు నీలోనూ లేకపోలేదు కదూ. మీ అత్తవారి ఊరు బరంపురం వెళ్ళేదారిలోనే కదా, ఒక్కమారయినా దిగావా?" అన్నాడు.

నేనన్నాను: "పోనీ వెనకటిమాటకేం, ఇప్పుడిలా తిన్నగా విజయనగరంలో దిగి మా ఊరురా, అక్కడ ఒక నాలుగు రోజులున్నాక నేనెలాగూ బరంపురం వెళ్ళాలి. కలిసి బయలుదేరుదాం; మీ ఊళ్ళో నువ్వుండమన్నన్నాళ్ళుంటాను."

అతను మర్నాడే కోర్టులు తెరుస్తారనీ, తప్పకుండా వెళ్ళితీరవలసినపని ఉందనీ అన్నాడు. మరి బలవంతంచేసి లాభం లేదని నాకు తెలుసును.

కొంచెంసేపు తటపటాయించి "అయితే ఇంకా హోటలు భోజనాన్ని విడిచిపెట్టలేదన్న మాట?" అన్నాను.

వాడు తిన్నగా సమాధానం చెప్పలేదు. "ఇళ్ళలో భోంచేస్తూన్న మీలో ఒక్కరయినా నాకంటె ఆరోగ్యంగా ఉన్నారా?" అన్నాడు.

"ఎలా ఉంటాం? మా కుటుంబాలకంతటికీ అయేపాటి ఖర్చు ఒక్క మనిషిక్రింద పెట్టుకొనే నీతో మేమెలాగు పోటీ చెయ్యగలం? చూడగా చూడగా నువ్వు మాతోనే కాదు, మా తరవాత తరం వాళ్ళతోకూడా పోటీ చేసేటట్టున్నావు"

"నేనేమో మీ అందరికంటె ఎక్కువగా తినేస్తున్నాననుకోకు. అయితే నా దినచర్యఅంతా ఒక క్రమబద్ధంగా నడుస్తుంది. సాయంకాలం ఎంత లేదన్నా ఆరేడుమైళ్ళు నడుస్తాను."

"ఇంటికి వచ్చేసరికి సంసారపు బాదరబందీ ఏమీ లేనివాడివి కాబట్టి హాయిగా షికార్లుకొడతావు. అందరికీ ఎలా కుదురుతుంది? బజారుపనో, మరోకటో, మరొకటో ఉండనే ఉంటుంది. పోనీ మామాటకేమి, మీతోడి ప్లీడర్లంతా మాత్రం నీపాటి ఆర్జిస్తున్నవాళ్ళు నీఅంత హాయిగా నిర్విచారంగా ఉండగలుగుతున్నారా?"

"హాయిగా ఉండడం అన్నదానిలోని తరతమభేదాలను కొలిచేయంత్రం ఏదీ లేదుకదా. ఒక్కొక్కడికి ఒక్కొక్కటి ఆనందం. కొందరు, నువ్వు చెప్పిన బాదరబందీ అను, తాపత్రయం అను. అది లేకుండా ఒక్కక్షణం ఉండలేరు. మరి కొందరికి ఏపనీ లేకపోయినా ఎక్కువమందితో కలిసి ఉండడం, అస్తమానం ఇతరులను గురించిన ఆలోచనలు చెయ్యడం అంటే కష్టంగా ఉంటుంది. అంతా అలవాటే. నువ్వు నాలుగురోజులపాటు ఇంట్లో మరెవ్వరూ లేకుండా ఒంటరిగా పడుకోగలవూ? నాకు నా గదిలో మరొకమనిషుంటే నిద్రపట్టకపోవడమే కాదు, పక్కగదిలో మనిషి కాస్త కదిలినా నిద్ర పట్టదు."

"అయితే పక్కగదిలో మనిషి అలికిడయితే నిద్రపట్టదన్న విషయం ఇటీవలే అనుభవపూర్వకంగా తెలుసుకొంటున్నావుకాబోలు. ఏం?"

"నీమాటలలో నిగూఢంగా ఉన్న ధ్వనియొక్క నిజస్వరూపం నాకు తెలియకపోయినా, నీకు మరేలాటి అపోహలు లేకుండా ఉండడానికి చెప్తున్నాను. నేను అప్పటికీ ఇప్పటికీ ఒక్కలాగే ఉన్నాను. మా బంట్రోతు రామస్వామి కింద సావడిలో పడుకొంటాడు. నేను మేడమీద పడుకొంటాను. అంతే."

"నీగురించి నాకేం అనుమానంలేదుకాని పక్కగదిలోని అలికిడిగురించే. లేక పక్క ఇంటిలోని అలికిడిగురించా నువ్వన్నది? ఏమో. ఆ మధ్యను నీగురించి చాలాచాలా విన్నానులే. అసలు దీక్షితులే మునపటి దీక్షితులు కాడని."

"మనుష్యులకి మార్పు సహజం. నాబోటివాడెవడో కాస్త మారకుండా ఉన్నట్టు కనిపిస్తే, ఎలాగోలాగు వాడూ మంచికో చెడుకో మారేడంటేనేగాని తృప్తిలేదు నీబోటివాళ్లలో కానికి."

"మనం రైల్లో కదలకుండానే కూర్చున్నా, రైలు కదలడంవల్ల మనమూ కదులుతున్నట్టవుతున్నట్టే, మన చుట్టూ ఉన్న లోకం మారిపోతున్నప్పుడు మనం మారకుండాఉన్నా మారినట్టే— ఒక కాలంలో, ఒక వాతావరణంలో ఒకరీతిగా కనబడినవి, కాలమూ, దేశమూ మారడంతో కొత్తగా కనిపించక తప్పదు."

"కనిపించేది లేదనే నీవంటిజగన్మిథ్యావాదితో మరి వాదించి లాభం లేదు. నేను నీ చిత్తంవచ్చినట్లు మారిపోయేను. సరా?"

"ఇంతలోనే ఇంతకోపమా? అసలు నీకు నువ్వు బాగా మారిపోయేవంటే సంతోషమో, అబ్బే లేదు, నాటికీ నేటికీ ఒక్కలాగున్నావంటే సంతోషమో నాకు తెలిసేకదూ! నీకు ఎలా కావాలంటే అలాగే ప్లేటు ఫిరాయించేవాణ్ని."

"అంటే నా ముఖప్రీతికోసంతప్పు మాట్లాడవన్నమాట"

"నీతో ఏదన్నా చిక్కే, సరేగాని, నీసంగీతం ఎంతవరకు వచ్చింది? అప్పుడు చదువుకూడా మానేసి వీణ సాధకంచేస్తూ కూర్చునేవాడివి."

"ఇప్పుడూ అప్పటి చదువులాటి అడ్డంకి ఏదైనా ఉంటే సాధకం బాగానే జరుగునేమో? నరసింహమూర్తి ఉన్నన్నాళ్లూ అదొక అవసరంగా తోచేది. ఇప్పుడూ రోజుకి ఒకగంటో అరగంటో పట్టుకొంటానుగాని మునపటి ఆ ఏకాగ్రత లేదు. ఇప్పుడు ఎక్కువభాగం రేడియో వినడంతో జరిగిపోతున్నది."

"చూసేవా మరి, మారలేదంటావు, నువ్వు మారుతునే ఉన్నావు. ఊరికినే అద్దంలో చూసుకొని మారలేదనుకొంటున్నావుగాని."

"నేను మారిపోయేనని సిద్ధాంతీకరించడంవల్ల నీకు కలిగేలాభమేమిటో నాకర్థంకాదు."

"పోనీ, మరెందుకు, నువ్వు లేశమాత్రమైనా మారలేదని నేను ఒప్పుకొంటున్నానుగాని, చాలా మేర తిరిగి వచ్చావు; విశేషాలు చెప్పదూ. మనవాడు నరసింహమూర్తి ఇకనైనా అక్కడ స్థిరపడినట్టేనా?"

అతను ఏదో చెప్పేడు, నేను విన్నానంటే విన్నానుగాని నా మనసంతా వేరేమార్గంలో సంచరించసాగింది. ఈనాడు ఇంత తేలికగా మాట్లాడగలుగుతున్నాము నేనూ దీక్షితులూ అతని ఒంటరి జీవితాన్నిగురించి. ఒకప్పుడు అందుకు కారణమైన పరిస్థితులు అతనిని ఎంతవరకు తీసుకొని వెళ్ళేయో తెలిసికూడా ఇప్పుడిలా మాట్లాడగలగడము చిత్రంగా తోచింది.

అతనికి కలిగినది కష్టంకాదని నేననుగాని, దానిని మరొకడయితే అంతిలా హృదయానికి

పట్టించుకోని, ఆత్మహత్యా ప్రయత్నంవరకూ వెళ్ళి ఉండడని నిశ్చయంగా చెప్పగలను. పెళ్ళయిన కొత్తలో, ప్రేమకవిత్వాన్ని పుస్తకాల్లోంచి జీవితంలోకి దిగుమతి చేద్దామనే ఉత్సాహపు పొంగు తగ్గకమునుపే భార్యా వియోగం; అదీ మృతివలన కాదు, సర్వవిధాలా తనకంటె తక్కువవాడుగా కనిపించే మనిషితో లేచిపోవడంమూలంగా. ఎవరికయినా కష్టం కలిగించే విషయమే. అయితే మరొక మామూలు వ్యవహారసరణి తెలిసిన మనిషి అయితే, మొదట ఎంత విచారించినా, కొద్దిరోజుల్లో ఆప్తవర్గము చెప్పిన మాటలను కాదనలేక, చక్కగా మళ్ళీ పెళ్ళి చేసుకొని నిక్షేపంగా సంసారం చేసూ ఉండి ఉండును. ఉఁహు! దీక్షితులు పంథా అంతా వేరు. తాను మరి బ్రతికి ఏం ప్రయోజనమని. తనకంటె అసమర్థుడూ అప్రయోజకుడూ అయినవాడు వేరెవడయినా యీ ప్రపంచంలో ఉంటాడా అని.

నేను అప్పట్లో ఒక్క క్షణమయినా విడిచిపెట్టకుండా ఛాయలా అనుసరించి, అతను చేసిన మూడు ఆత్మహత్యా ప్రయత్నాలను భంగపరచడంతో నిశ్చయంగా చెప్పేసేను మరి తాను అటువంటి ప్రయత్నం చెయ్యబోడని. అయితే మరి తనను మళ్ళీ పెళ్ళి చేసుకోమనేవాళ్ళు మాత్రం తనను కేవలం బాధపెట్టే ఉద్దేశంతోనే అలా మాట్లాడుతారని తాననుకొంటాడని.

తనయెడల ప్రేమలేదని స్పష్టంగా తెలియజేసిన మనిషిని, తనను కాదని వేరొకనితో లేచి వెళ్ళిపోయిన మనిషిని ప్రేమించకుండా ఉండలేని మనుషులుంటారంటే అదివరకు నాకు నమ్మకం కలిగేది కాదు. నేను అన్యాపదేశంగా చాలామార్లు చెప్పి చూసేను. ఇప్పుడింతగా నువ్వు ప్రేమఅనేభావన కలగడానికి ప్రధాన కారణమేమిటి? వివాహమే కదా! మరొక వివాహంలో మాత్రం అటువంటి ప్రేమ జనకమయిన శక్తి ఉండదా? శరీరానికి తగిలిన ఎంతలేసి గాయాలు మానిపోతున్నాయి కదా! కొత్త పరిసరాలూ వాతావరణం ఏర్పరిస్తే మనసుమాత్రం అందుకు అనుగుణంగా ఎందుకు మార్పుచెందదు? అసలు మన ప్రయత్నం అక్కరేలేదు; సంతతమూ అదేపనిగా సంస్మరిస్తూ కూర్చోకుండా ఉంటే చాలును, దానంతటదే కొత్తరుచులకూ వాసనలకూ అలవాటు పడుతుంది మనను, మనజీవితాన్ని మనమే దుఃఖభాజనం చేసుకొని, ఎవరిమీదనో పగసాధించుతున్నామనుకోడం కంటె అవివేకం అంటూ ఉండదు.

ఇలా నేను చెప్పేవాటికి అతనుతరుచు జవాబు చెప్పేవాడుకాడు. ఎప్పుడయినా మాట్లాడినా "అవును, నిజమే, అంతేసుమా'' అనేవాడు. అంటే ఏమిటి, నేను చెప్పినమాటల్లోని నిజం లోకంలోని మరెవరికయినా వర్తిస్తుందిగాని తనకి వర్తించదని. తనది అన్ని పరిస్థితులకూ అతీతమయిన ఒక విపరీత స్థితి అని. తన విషయంలో మామూలు ఊహలూ తర్కమూ కార్యకారణ సమన్వయమూ ఇవేవీ పని చెయ్యవని అతని ఉద్దేశం. లేకుంటే వాదించి ఉండేవాడే. వాదించే స్థితికంటూవస్తే, అప్పుడు కాకపోతే మరొకప్పుడయినా మామూలు ధోరణికి వచ్చునని నా ఆశ.

చివరికి తక్కిన వాళ్ళతోపాటు నేనూ లాభం లేదని విడిచిపెట్టేసేను. అంతే, మామూలుగా అందరికీ సామాన్యంగా తోచేవే — పరీక్షపోవడమూ, చిన్నదొంగతనంచేసి దొరికిపోవడమూ, చేసిన చీకటితప్పు బైటపడిపోవడమూ మొదలయినవి. కాని, ఇటువంటి కారణాలకే ఆత్మహత్యలు చేసుకొన్నవాళ్ళనేకులు లేకపోలేదు. మా దీక్షితులుకూడా ఆకోవలోనివాడే. అయితే మూడుమార్లు తన ప్రయత్నం విఫలం కావడంతో క్లయివుగోరలాగ, ఆత్మహత్యాప్రయత్నం మాత్రం విరమించుకొన్నాడు కాని, కేవలం బాధను భరించడం అన్న లెక్కనుచూస్తే, ఒక్కమారుగా చచ్చిపోయినవాళ్ళ కంటె బ్రతికి అనుభవించేవాళ్ళదే ఎక్కువకష్టం అనిపిస్తుంది.

బి. యే. అనంతరం వాడు బి. యల్ చదివేడు, నేను చిన్నప్పుడు చదువుకొన్న స్కూల్లో ఒక ఏడాది మాష్టరీచేసి, యల్. టి., అయి బడిపంతులుగా స్థిరపడ్డాను. ఇలా విడిపోయినప్పటికీ కొన్నాళ్లపాటు విధిగా వారం పదిరోజుల కొకటిచొప్పున ఉత్తరాలు రాసుకొనేవాళ్ళం. క్రమంగా మా మధ్య ఉత్తరాలు స్తంభించిపోడానికి బాధ్యత నూటికి నూరుపాళ్ళు నాదే. వాడు రాసిరాసి ఎన్నటికీ జవాబు లేకపోడంతో విసిగి ఊరుకొనేవాడు. నేను ఎప్పుడో ఒక్కమారు మా ఉత్తరాల పరివర్తనయోగాన్ని సముద్ధరించవలసి ఉందంటూ ఒక పెద్దఉత్తరం రాయడమూ, వాడు తరవాత సక్రమంగా రాస్తూ ఉండడమూ నేను బద్ధకించి ఊరుకోడమూ జరిగేది. అసలు సంసారంలో దిగబడిపోయి, దైనికచర్యా చక్రాన్ని అణుమాత్రమయినా మార్పులేకుండా తిప్పుకొంటున్నవాడికి ఉత్తరం రాయవలసిన అవసరమూ కనబడదు. కనబడినా అదీ ఒక పెద్ద తప్పించుకోవలసిన బరువుగానే ఉంటుంది. అయినా మా పిల్లలు పుట్టినవెంటనే శుభలేఖలు రాసేను, పెద్దపిల్ల పెళ్ళికి

రాసేను. వాడు రాలేదని మాత్రం ఏమీ అనుకోలేదు. వాడు ఆనాటినుండీ ఎవరింటికి యేపెళ్ళికీ వెళ్ళడం లేదని తెలిసి వేరొకలా ఎలా అనుకోగలను? అయితే వాడు, నే నెన్నడూ ఊహించలేని పెద్దమొత్తాన్ని పెళ్ళికుమార్తెకి కట్నంగా పంపించాడు. వాడి సంసారమే తిన్నగా నిలబడిఉంటే? ఈ సరికి ఎంతలేసి పిల్లలు ఉందురో? వాడి మనస్సుకి ఎంత హాయిగా ఉండునో? అన్నరకంఆలోచనలు నన్ను అతరువాత చాలా కాలం పీడించాయి.

పక్కనే అతనుమనిషి ఉన్నాడుగాని మనసుకి మాత్రం ఏనాటివో చిత్రాలు కనిపించసాగాయి. ఇప్పుడతన్ని చూస్తే ఎవరికీ ఏమీ విచారించవలసినది కనబడదు. అంతేకాదు. సాంసారిక జీవితంలోని వడిదుడుకులకు తట్టుకోలేని సమయాల్లో బంధరహితమయిన అతని జీవితమే ఎంతో హాయనిపించడమూ వింతకాదు. అయినా గతం అంతా తల్చుకొంటే మాత్రం ఒక సహృదయుని, జీవితం రసహీనమై పోయిందే, ఆదర్శప్రాయుడయిన గృహస్థు కావలసిన ఒక సమర్థుడు తనవాళ్ళు అనుకొందికి ఎవ్వరూ లేక పోయేరే అన్న విచారం కలగక మానదు.

నా ఆలోచన ఇంకా తెములనే లేదు. రైలాగింది. అతను చదువుతున్న పత్రికమూసి, పద, మరొకమారు కాఫీ తాగివద్దామన్నాడు.

మేము తిరిగి వచ్చేసరికి ఎవరో మా స్థలం ఆక్రమించుకోడంవల్ల మొదట కొంచెం ఘర్షణపడినా చివరికి సర్దుకొని, అదివరకు ఇద్దరికి సరిబడిన స్థలంలోనే నలుగురమూ కూర్చున్నాము. మరి నా వెనుకటి దీక్షితులునుగురించిన ఆలోచనలూ లేవు; అతని పుస్తకపఠనమూ లేదు. మా స్థలాన్ని మాకు తిరుగా ఇచ్చిన పెద్దమనుష్యు లిద్దరూ రాజకీయాలు అమోఘంగా చర్చిస్తున్నారన్న సంగతే మేము గుర్తించాము. తరవాత ఆ చర్చలో మేముకూడా మునిగిపోయేమన్న విషయం చాలాసేపటివరకూ స్ఫురించలేదు. రాజకీయాల్లో నాకూ దీక్షితులుకీ అభిప్రాయాలు కలియవన్నది మొదట్లోనే తేలిపోయింది. అసలు మేమిద్దరమూ వేడెక్కిపోయి కొట్టుకోకుండా కాపాడే బాధ్యతకూడా తమదిగా మాతోడి ప్రయాణీకులు భావించవలసినంత ధాటీగా సాగింది వాదధోరణి.

రైలు ఆగింది. ప్రక్కనున్న ఆయన కిళ్లీలు సిగరెట్లు సరఫరాచెయ్యడంతో వాదన ఆగిపోయింది. మావాడు సిగరెట్టుపుచ్చుకొని నాకిచ్చేడు. కిళ్లీకూడా వేసుకొన్నట్టులేదు. ఏంచేసేడో. ఈ మారు ప్రసంగం సినీమాలవంక తిరిగింది. నేనూ వాడూ కూడా మా అశక్తిని తెలిసినవాళ్ళంగనక కేవలం శ్రోతలుగా తయారై సుమారు ఆరునెల్లుగా సినీమాపత్రికల్లో వచ్చిన వాఙ్మయమంతటినీ ఆకర్ణించేము. మాకు ఇంత స్వల్పవ్యవధిలో ఇంతటివిషయగ్రహణభాగ్యం కలిగించిన ఆ యువకులకు ఎంతయినా కృతజ్ఞులము.

గోదావరి బ్రిడ్జి దాటింది. గోదావరి స్టేషనులో మా దీక్షితులుకి తెలిసిన నల్లకోటాయన ఒకరు కనిపించేరు. బహుశః ఆయనా ప్లీడరే ననుకొంటాను. ఆయనా తుదివరకూ వస్తానన్నాడు.

నేను ఒక్కడినే రాజమండ్రిస్టేషనులో దిగేను. పుస్తకాలషాపులో చాలాసేపు గడిపి ఒక రెండు పుస్తకాలతో బైట పడ్డాను. ప్లాటుఫారంమీద ఎవ్వరూ తెలిసినవారు కనబడలేదు. బండిలోమావాడు, ఆనల్లకోటాయనతో తన్మయుడై మాట్లాడేస్తున్నాడు.

ఏమీతోచక ప్లాటుఫారం చివరివరకూ వెళ్లేను. టైము అట్టేలేదు. ఒకటో రెండో గంటలు కొట్టేరు. తొందరగా మా బండిదగ్గరకు తిరిగి వస్తూఉండగా "ఏమండీ పంతులుగారూ" అని కొంచెం వెనకనుండి ఆడగొంతు వినిపించింది. నడక ఒక్కమారు ఆగింది కాని నన్నెవరు పిలుస్తారని మళ్ళీ అడుగు వెయ్యబోతూఉంటే "మిమ్మల్నే" అన్న హెచ్చరిక వినిపించి వెనక్కి తిరిగేను. మరెవరూ కాదు కృష్ణవేణమ్మగారు. కాబట్టే ఆమాత్రం ధైర్యంగా పిలవడం జరిగింది. నేను చూడకపోయినందుకు క్షమాపణ చెప్పనియ్యకుండా ఆవిడ "ఇందాకా మీ రిలా పుస్తకం పట్టుకొని వెళ్ళడం చూసేను. అయితే నేను చూసేసరికి మీరు వెనక తిరిగి ఉన్నారు. అయినా మీరే ననుకొన్నాను. ముందు బండిలో ఎక్కిపోతా రనుకొన్నాను. అక్కడ నిలబడి ఉండడం చూసి మళ్లీ ఇటువస్తే పిలుద్దామనుకొన్నాను. ఒక్కమారెందుకో ఇటుతిరిగేసరికల్లా మీరు దాటిపోయేరు."

"ఎక్కడ దాటిపోయేను? రమణమూర్తిగారున్నారా?"

"ఆఁ ఉన్నారు. ఇదుగో పడుక్కొన్నారు. రండి. ఒక్కరే వస్తున్నారా? వదినెగారూ వాళ్ళూ ఉన్నారా?"

"లేదండి, నే నొక్కణ్ణే గుంటూరు వెళ్లివస్తున్నాను. అమ్మాయిలు బాగున్నారా? ఏం చదువుతున్నారు?"

"ఇద్దరూ బి. యే చదువుతున్నారు. యమున సీనియరు. సరస్వతి జూనియరు. రండి. రైలుకూసింది. వచ్చేస్టేషనులో మీ పెట్టెలోకి వస్తారుగాని."

సామర్లకోటలో వాళ్ళు దిగి కాకినాడ వెళ్ళే బండిలో ఎక్కేవరకూ నేను వాళ్ళతో నేఉన్నాను. కాకినాడలో మా చెల్లెలుగారూ వాళ్ళూ ఒకేఇంట్లో అద్దెకుండేవాళ్ళు. అదీ పరిచయం. రమణమూర్తి ఫోటోలు తీసేవాడు. సైనుబోర్డులురాసేవాడు అంటే పేరు అతనిది; పని చాలా భాగం ఆమెది. ఎటువంటి చిలిపిమనిషికూడా అపార్థం చేసుకోందుకివీలు లేకుండా వుండేది. ఆవిడకలుపుగోలుతనం. ఇద్దరే ఆడపిల్లలు. వయసులో ఒకసంవత్సరం నర భేదం ఉన్నా ఒక్కలాగే కనిపించేవారు. ఒక్కపిల్ల నేచూస్తే యమున ఎవరో సరస్వతి ఎవరో తెలిసేది కాదు. అందానికి లోటు లేకపోయినా అందుకు విభిన్నమైన ఆకర్షణ ఏదో కనిపించేది. ఇద్దరూ యిలా చక్కగా విన్న ప్రతి పాట పాడగలిగేవాళ్ళు అయితే నేను చూసి అప్పుడే ఏడెనిమిదేళ్ళు కావస్తుంది. అప్పటికి పెద్దపిల్లకి పన్నెండేళ్లకంటె ఎక్కువ ఉండవు. ఇప్పటికి చాలా మారిపోయిఉంటారు ఆకారంలోను అభిరుచులలోను. పాపం. అతను రమణమూర్తి క్షయతో బాగాకృశించి పోయేడు. సుమారు రెండుసంవత్సరాలయిందట. నాముటుకు నాకుచూస్తే మరికొద్దినెలలు నిలబడడం కూడా కష్టమనిపించింది. కాని, ఆవిడ ఇదేనయమంది. లోగడ ఇంతకంటె దుర్బలంగా ఉండేవాడట. కేవలం రోగిముందు ధైర్యంగా ఉండడానికి అలా అందో, లేక నిజంగానే ఆవిడకు అలా అనిపించిందోగాని, నాకుమాత్రం మరి ఏమీఆశఉన్నట్టు కనిపించలేదు.

ఆవిడ శానిటోరియమ్‌లోకంటె ఇంటిదగ్గరే బాగుంటుందని తీసుకొని వెళ్తున్నానన్నా నిజమైన కారణం ధనాభావమనిపించింది. పాపం, ఎలా నడుపుకొనివస్తున్నదో. ఇద్దరు పిల్లలు ఇంకా చదువుతున్నారు. వాళ్ళ ఖర్చులు, జబ్బుమనిషి ఖర్చులు. పూర్వం ఉండేపాటికూడా ఆభరణాలు లేవు. అయినా మనిషి ఏమీ దిగులుపడినట్లుగా కనబడదు. ఒకొక్కక్కరిస్వభావంలోని వైచిత్ర్యమేఅది; లోపల బడబానలం ప్రజ్వరిల్లుతున్నా పైకి ఆనందవీచికలు వెల్లివిరిసేలాగ ఉండగలరు

మా చెల్లెలుగారికి ఆఊరునుండి బదిలీ కావడంతో నాకు మరి వాళ్ళభోగట్టా ఇన్నాళ్ళూ తెలియలేదు. అయితే తెలిసినప్పుడు చేసేదేమిటి? తెచ్చిన జీతంతో దినవచ్చ మేరీతి తీర్చగలను అన్న సమస్య నానాటికీ బిగుసుకుపోతూఉంటే! నిజంగా ఇటువంటి పరిస్థితిలో అదొక పెద్దసహాయం అనీ, అందువల్ల అవతలివాళ్ళ యిబ్బందులన్నీ తీరి తరించిపోతారనీ కాదు, కాని ఒకవందో రెండువందలో ఇవ్వగలిగితే మన మానవత్వంమీద మనకే గౌరవం కలుగుతుంది.

నేను సామర్లకోటలో వాళ్ళను దిగబెట్టి వచ్చేసరికి మావాడు నాకోసం చూస్తున్నాడు. ఆ రెండో ప్లీడరుగారు పేపరు చదువుకొంటున్నారు.

ఇంతసేపూ ఎక్కడికి పరారీ అయిపోయేవన్న మావాడి ప్రశ్నకి సమాధానంగా కృష్ణవేణమ్మగారి కబుర్లు చాలాసేపు చెప్పాను. అంతేకాదు, ఇంటికి వెళ్ళేక ఎలాగయినా వీలుచేసుకొని రెండువందలు కాకపోతే అథమం వందయినా పంపించాలనుకొంటున్నానన్న సంగతికూడా చెప్పకుండా ఉండలేకపోయేను. వాడితో అన్నానుకదా, మాట నిలబెట్టుకొందామని యత్నిస్తానేమోనని ఆశ.

వాడుమాత్రం ఊరుకోలేదు. "పంపించడం మూలాన నువ్వు ఇబ్బందిపడడం నిశ్చయం; అంతకుమించి వాళ్లకు ఎంతలాభం ఉంటుందంటావు? ఆ జబ్బుకయే ఖర్చులగురించి నీకేమీ తెలియవట్టుంది. అయినా ఇన్నాళ్లు గడిచిన మనుష్యులు, ఇకముందు మాత్రం గడపలేరంటావా?"

నేను: "ఈ విషయంలో నేను అట్టే వాదించదలుచుకోలేదు! నిజమే. డబ్బు పంపడం నాకు ఇబ్బందే కాదు, మామూలు అవసరమన్న లెక్కను చూస్తే అసాధ్యమే. కాని, ఇవాళ ఆవిడను కలుసుకోకపోతే, ఆ జబ్బుమనిషిని చూసిఉండకపోతే, ఏమీ లేదు. కాని, ప్రత్యక్షంగా చూసికూడా ఊరుకోడం ఒకవిధమైన ఆత్మవంచనే. ఇక, నా చేసే సహాయం పూర్తిగా వాళ్ల అవసరాలను తీర్చలేదు కదా అని అసలే చెయ్యకుండా ఉండడం తప్పించుకొనే అమానుషమైన ఎత్తనిపిస్తుంది. పాపం, ఆ పిల్లల చదువులైనా పూర్తిఅయిఉంటే ఇంత ఇబ్బంది లేకపోవును. ఎంత చక్కగా పాడేవారనుకొన్నావు! ఇటీవల రేడియోలోకూడాపాడుతున్నారట. ఈవచ్చే పదిహేనవ తేదీని వాళ్ల ప్రోగ్రాము ఉందట. అయినా ఇప్పుడేదో మామూలుగా అందరూ పాడినట్టే ఉండి ఉంటుంది. అందులోనూ వాళ్లు పాడేది శాస్త్రీయ సంగీతంట"

"అదంటే అసలు నీకు తలనొప్పికదూ?"

"నిజమే, అయినా ఈమారు వినాలి. కొత్త అభిమానంతో వింటే ఎలా వినిపిస్తుందో?"

"ఎలా వినిపిస్తుందా? చక్కగా రంగద్దాలు పెట్టుకొని చూస్తే ఎలా కనిపిస్తుందో అలా వినిపిస్తుంది."

"పోనీలే ఎటువంటి అభిమానాల రంగద్దాలు లేని నిశితమైన వీక్షణం గల నీవంటి వాళ్లు కొందరుంటేను చాలదా?"

"భోజనం మానుకొని కూర్చున్నావు. నామీద కోప్పడితే ఆకలి తీరుతుందా? సైలాగనీ, తిన్నన్ని గారెలు, కావలసినంత కాఫీ"

తరువాత ప్రయాణం ఎటువంటి వాదోపవాదాలు లేకుండా సాఫీగా గడిచిపోయింది. నేను విజయనగరంలో దిగిపోయేను. వాడూ నాతో ప్లాటుఫారంమీదకి వచ్చేడు. నేను పళ్ళు బేరం చేస్తుంటే ఏదో జ్ఞాపకం వచ్చినట్టు గబగబ బండివంకకు వెళ్ళేడు.

ఇంటికి వెళ్ళగానే తినడానికి బాగుంటాయని వాడిని కొక రెండు మామిడిపళ్ళూ ఒక అనాసపండూ ఇచ్చేను. వాడు నామాటే వినిపించుకోకుండా ఏదో రాస్తున్నాడు.

రయిలు కదిలేముందు వాడు నా చేతికి, ఒక మడిచిన కాగితం ఇచ్చి "చెక్కిచ్చేను. ఇక్కడ ఆంధ్రాబేంకులో నాకు ఎకౌంటు ఉంది. నీకు కొంచెం చిక్కయినా రేపు ఉండి, ఇది మార్చి డబ్బు ఇన్స్యూరుచేసి పంపించు."

"ఎవరికి నీకేనా? అంతకంటె నువ్వే ఉండి మార్చుకోకూడదూ? అయినా నువ్వక్కడ ఉండి ఇక్కడ ఎకౌంటేమిటి? అక్కడ బేంకు లేక పోయిందా?"

"ఉన్న ఊళ్ళోకంటె పై ఊళ్ళోనే మేలని వెనకటికి నీలాటివారొకరు సలహా యిచ్చేరే. సరె నామాటకేమి. డబ్బు పంపించవలసింది నాకు కాదు, ఆవిడకు"

"ఆవిడా? ఎవరు?" నాకేమి వెంటనే స్ఫురించలేదు."

"ఆవిడ కావేరమ్మ"

"కావేరమ్మ కాదు కృష్ణవేణమ్మ ఆవిడ పేరు. నిజంగా కార్యశూరుడి లక్షణం ఇది. నాలాగ వట్టి కబుర్లతో మేడలుకట్టి ఏంలాభం? నువ్వుచేసిన మంచి పనుల్లోకల్లా..." రయిలు కూసింది.

వాడు ఏదో మరిచిపోయినట్టుగా రయిలు నడుస్తూ ఉండగా "నా సంగతి ఏమీ ఎత్తకుండా నువ్వు పంపినట్టే పంపాలిసుమా" అన్నాడు.

"నీ కిష్టం లేకపోతే అనామతుగా అయినా పంపిస్తాను గాని నా పేరు పెట్టుకొంటానా? అంత అక్రమకీర్తి కాంక్ష నాకు లేదు." మాట చివరిభాగం, వాడి బండి దూరం అయిపోవడంవల్ల నాలో నేనే అనుకొన్నట్టయింది. అయినా మరెవరో కొందరు ప్రయాణికులకు వినిపించి ఉంటుంది.

చెక్కు చూడకమునుపు వందకి తక్కువ ఉండదని అనుకొన్నాను. దీపం వెలుగులో రెండు కనిపించేసరికి రెండువందలనుకొన్నాను. కాని, ఏమిటి ఒక సున్నా గాని ఎక్కువ పడలేదుకదా? ఊఁహుఁ అక్షరాలా స్పష్టంగా రాసిఉంది. సందేహం లేదు. రెండు వేలే!! నన్ను నేను నమ్మలేకపోయాను. మళ్ళీ మళ్ళీ జాగ్రత్తగా చూసి చెక్కు మడిచి లోపలి జేబులో పెట్టుకొని, కూలిమనిషి నెత్తిని పెట్టె హోల్డాలు పెట్టి ఒవరుబ్రిడ్జి ఎక్కుతూ ఉంటే అప్పుడు స్ఫురించింది. దీక్షితులు భార్యపేరు కావేరి అని. నాడు కావేరి, దేవేరి అని ప్రాసమహా గొప్పగా కుదిరిందని అంటూ ఉండడం జ్ఞాపకం వచ్చింది.

నాకు తెలియదుగాని, ఇందాకా నేను చెప్తున్నంతసేపూ వాడికి తెలిసే ఉంటుంది నేను కృష్ణవేణమ్మ అని అంటున్న మనిషెవరో. లేక కేవలం వాడు పొరపాటున, రెండూ నదులపేరే కాబట్టి, ఒకపేరుకి బదులు ఇంకొకటి అన్నాడేమో? ఏమయినా వాడు చేసిన సహాయం చాలా ఉచితమైనది. ఇందువల్ల బేంకులో ముఫ్ఫై నలభై వేలున్న వాడికి ఏమీ కష్టంలేదు, కాని వాళ్ళకు కలిగే సదుపాయము మాత్రం చాలా విలువయినది. కేవలం నా మాటలనుబట్టి తనకు ఏమీ తెలియకపోయినా కష్టదశలో ఉన్న ఒక కుటుంబానికి సహాయం చెయ్యడం గొప్పమాటే. కానీ, ఆవిడే నిజంగా అతని లేచిపోయిన భార్య అయిఉండి, ఆ సంగతి తెలిసికూడా వాడీరకంగా సహాయం చేసేడంటే అది మరీ గొప్ప విషయం కాదూ?

ఊఁహుఁ సందేహం లేదు. మా చెల్లెలు కూడా ఒకటి రెండుమార్లు, "ఆవిడదంతా చాలా పెదగాథ ఉందిలే అనడం జ్ఞాపకం. అయితే తగిన కుతూహలం లేక తెలుసుకోలేదు. అసలు, దీక్షితులు అక్కడ ఆమెను ప్లాటుఫారంమీద చూసేడేమో? చూస్తే మాత్రం, ఆవిడ మొదటినుండీ కృష్ణవేణమ్మే అయి ఉంటే?—ఏమయినా సరే, నా మధ్యవర్తిత్వం అక్కడ కాకపోయినా ఇక్కడ ఈవిధంగా ఫలించవలసిన యోగం ఉంది కాబోలు. నా ప్రయాణం పూర్తిగా వ్యర్థం కాలేదు. నాకంతే చాలును.